క్లుప్తంగా

11కు పెరిగిన ఎంపీటీసీ స్థానాలు



మానవపాడు: మండల కేంద్రంలో రెండు ఎంపీటీసీ స్థానాలు పెరిగినాయని ఎంపీడీఓ భాస్కర్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో మండలంలో 9 ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. నేడు కొత్తగా ఏ.బుద్ధిపాడు, మానవపాడు-2లను కొత్తగా ఎంపీటీసీ గెజిట్ విడుదల చేశారని, దీంతో మండలంలో మొత్తం 11ఎంపీటీసీ స్థానాలు ఉన్నట్లు పేర్కొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ



ఎర్రవల్లి: మండల పరిధిలోని కొండపేట గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వెంకటేష్ భూమిపూజ చేశారు. రూ.5లక్షల వ్యయంతో రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పల్లెలను అభివృద్ధి చేయడం కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు గొల్ల నర్సింహ, నర్సింహ, వెంకటన్న, నాగరాజు, ఎల్లారెడ్డి, సహదేవుడు, రామాంజనేయులు, శేషన్న, తదితరులు పాల్గొన్నారు.

మాదాసి కురువలుగా గుర్తించాలి



మల్దకల్ : ప్రభుత్వం మాదాసి కురువలుగా గుర్తించి కులం సర్టిఫికెట్లు అందజేయాలని కురవ కులస్తులు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు వెంకటేష్, రామకృష్ణ, సవారన్న, వీరన్నలు మాట్లాడుతూ.. గతంలో కురువ కులస్తులుగా అధికారులు సర్టిఫికెట్లు మంజూరు చేశారని, ఇటీవల విద్యార్థులకు నవోదయ, గురుకులాల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోగా తమ పిల్లలకు కురుబ సర్టిఫికెట్లు మంజూరు చేశారన్నారు. కుర్వ కులస్తులకు ఓసారి కురుమ అని మరోసారి కురుబ అని సర్టిఫికెట్లు జారీ చేయడంతో తమ పిల్లల భవిష్యత్తు ఏమవుతుందోనని ఆందోళన చేశారు. ప్రభుత్వం మాదాసీ కురువలుగా గుర్తించి సర్టిఫికెట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీటీ ఝాన్సీరాణికి అందజేశారు. కార్యక్రమంలో అంజిబాబు, మద్దిలేటి, రంగస్వామి,వీరన్న, లక్ష్మన్న, పరుశరాముడు, రాఘవేంద్ర, రామాంజనేయులు, తిరుమలేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి స్కేటింగ్‌లో ప్రతిభ



ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు గ్రామానికి చెందిన కరుణం దివితేష్ దీపక్ జాతీయ స్థాయి స్కేటింగ్‌లో ప్రతిభచాటాడు. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 2 వరకు మధురైలో జరిగిన 24వ జాతీయ స్కేటింగ్ చాంపియన్ షిప్‌లో స్కేటింగ్‌లో 2 కాంస్య పతకాలు, 1 రజత పతకం సాధించినట్లు దీపక్ తల్లితండ్రులు కరుణం చంద్రమోహన్ రావు, కవిత తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయుడు, ఉమ్మడి మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి ఫోన్‌లో దీపక్ తల్లితండ్రులను అభినందించారు. దీపక్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతిలో పద్మావతి హైస్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు.

ఉపాధి హామీకి అధిక నిధులు కేటాయించాలి

ధరూరు : కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి అధిక నిధులు కేటాయించాలని సీపీఎం మండల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌక్ వద్ద సీపీఎం నాయకులు అర్ధనగ్న ప్రదర్శన చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల నాయకులు దేవదాసు మాట్లాడుతూ.. విద్య, వైద్య రంగంతో పాటు ఉపాధి రంగానికి అధిక నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు నర్సింహులు, మోష, తిమ్మప్ప, వినయ్, ప్రవీణ్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు



ఉండవెల్లిలో చిన్నారుల అక్షరభ్యాసం

గద్వాలటౌన్ : జిల్లా పరిధిలో వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సాంప్రదాయబద్ధంగా వసంత పంచమి ఉత్సవాలను చేపట్టారు. పలు పాఠశాలల్లో విద్యార్థులచే అక్షరాభ్యాసం చేశారు. స్థానిక కోటలోని చెన్నకేశవ స్వామి ఆలయం, విశ్వభారతి, కాకతీయ, బెటర్ లైఫ్ స్కూల్, విశ్వం హైస్కూల్ తదితర పాఠశాలలో వసంత పంచమి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీలో..

మానవపాడు: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో సోమవారం ఎస్ఓ అనురాధ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. సరస్వతి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. సరస్వతిదేవి అవాసపూజ, హోమం చేపట్టినట్లు లిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో వసంత పంచమి సందర్భంగా సరస్వతి అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం చిన్నారులకు అక్షరభ్యాసం, పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దామోదర్ రెడ్డి, అర్చకులు ఆంజనేయ శర్మ, తదితరులు పాల్గొన్నారు.



గద్వాలలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు



గద్వాలలో సరస్వతి శిశుమందిర్‌లో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు

తక్షణమే డబుల్‌బెడ్రూం ఇళ్లు అప్పగించాలి



డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

గద్వాలటౌన్ : లక్కీడిప్ ద్వారా ఎంపికైన లబ్ధిదారులకు తక్షణమే డబుల్ బెడ్రూం ఇళ్లను అప్పగించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం బీజేపీ నాయకులు స్థానిక డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలించారు. ఇళ్లకు సంబంధించిన కిటీకిలు, తలుపులు చాలా వరకు విరిగిపోయిన విషయాన్ని గమనించారు. మౌళిక సౌకర్యాలు లేకపోవడం, పరిసర ప్రాంతాల్లో పేరుకపోయిన ముళ్ల పొదలు ఏర్పడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి గత పదేళ్లుగా డబుల్ బెడ్రూం ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేస్తు వస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు ఇళ్లను చూపించి ప్రతి ఎన్నికల్లో లబ్ధి పొందారన్నారు. ఎంపీ డీకే అరుణ దూర దృష్టితో పేదలకు ఇళ్ల పట్టాలు ఇప్పిస్తే, వాటిని ఎమ్మెల్యే రద్దు చేయించారని మండిపడ్డారు. అనేక పోరాటాలు చేసి, న్యాయ స్థానాన్ని ఆశ్రయించి చాలామంది పేదలు ఇళ్ల పట్టాల స్థానంలో ఇళ్లు పొందిన ఇప్పటి వరకు ఇళ్లను అప్పగించలేదని ధ్వజమెత్తారు. డిప్ ద్వారా జిల్లా కలెక్టర్ ఇళ్లు కేటాయించిన జాబితాలో కూడా రాజకీయ స్వార్థంతో పేర్లు తొలగించారని ఆరోపించారు. ఎక్కడ స్థలాలు లేనట్లుగా పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో మెడికల్ కళాశాల, జిల్లా ఆస్పత్రి, నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయడం ఎమ్మెల్యే అవగాహన రాహిత్యానికి నిదర్శనమన్నారు. ఎమ్మెల్యే పార్టీ ఫిరాయింపుపై చూపిన శ్రద్ధ, ప్రజల సమస్యలపై లేకపోవడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవికుమార్, రామాంజనేయులు, జయశ్రీ, బండల వెంకట్రాములు, నర్సింహ, వెంకటేశ్వర్‌రెడ్డి, దేవదాసు, కిరణ్, అనిల్, డబ్బిలేటి నర్సింహ, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో పీఠాధిపతి పూజలు



మల్దకల్: ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం వ్యాసరాయ మఠం పీఠాధిపతి విద్యాధీశ తీర్థ శ్రీపాదులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతికి ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. భక్తులను ఉద్దేశించి స్వామి వారు మాట్లాడారు. మారుతున్న కాలానుగుణంగా ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడుచుకోవాలన్నారు. చెడు వ్యసనాలు వీడి ఆధ్యాత్మికత చింతనను అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం స్వామి వారికి ఆలయ మర్యాదలతో సత్కరించి మెమొంటో అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు రమేషాచారి, మధుసూధనాచారి, రవిచారి, దీరేంద్రదాసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా అంజన్న రథోత్సవం



స్వామివారి రథం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ధరూరు: మండల పరిధిలోని పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బ్రహోత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాసాంగాలు స్వామి వారికి సమర్పించారు.

సీనియర్ సివిల్ జడ్జి పూజలు..

ఉత్సవాల సందర్భంగా స్వామివారికి జోగుళాంబ గద్వాల జిల్లా కోర్టు జడ్జీ లక్ష్మీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు జడ్జీని లాంఛాలతో ఆహ్వానించారు. శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేసినట్లు ఆలయ ప్రధాన అర్చకులు కిష్టాచార్యులు, మధ్వచార్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గిరిరావు, దేవదాయశాఖ ఈఓ కవిత తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం



ఉండవెల్లి : మండలంలోని పుల్లూరు గ్రామంలో వెలసిన చౌడేశ్వరి అమ్మవారి ఆలయానికి ధూపదీప నైవేద్యాలకు కొంకుంట్ల గ్రామానికి చెందిన రెడ్డి గారి వెంకటేశ్వర్ రెడ్డి కుమారుడు రాఘవరెడ్డి రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దాతను అభినందించారు. కార్యక్రమంలో లక్ష్మీకాంతారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శేషు నాయుడు, అంపయ్య, మద్దిలేటి, కరన్న, శ్రీనివాసులు, బలిజ సోమశేఖరయ్య పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు



బహిరంగ చర్చ వేదికలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నర్సింగరావు

మల్దకల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ అధ్యక్షతన 14వ విడత సామాజిక తనిఖీ బహిరంగ చర్చ వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందాలు ఉపాధి హామీలో జరిగిన అవినీతి, అక్రమాలను బహిరంగ చర్చ వేదికలో గ్రామాల వారిగా చేసిన పనుల వివరాలను చదివి వినిపించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా ఆయా గ్రామాల్లో రోడ్లకు ఇరువైపుల నాటిన మొక్కలతో పాటు తోటల పెంపకంలో అవినీతి, అక్రమాలు జరిగినట్లు సామాజిక తనిఖీ బృందం సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వర్షాకాలంలో కొన్ని గ్రామాల్లో పనులు జరగకున్నా జరిగినట్లు రికార్డులు సృష్టించి బిల్లులు డ్రా చేసినట్లు తనిఖీలో బయటపడ్డాయి. మండలంలో మొత్తం 25 గ్రామ పంచాయతీలలో రూ.4కోట్ల 33 లక్షల ఖర్చుతో ఉపాధి హామీ పనులు చేపట్టగా వాటిలో కూలీలకు రూ.3,88,98,724, సామగ్రి నిర్వాహణకు రూ.44,78,704 ఖర్చు చేసినట్లు ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ ఏపీడీ శ్రీనివాసులు, సీనియర్ క్వాలిటీ కంట్రోలర్ చాముండేశ్వరి, ఎస్ఆర్‌సీ బాలు నాయక్, ఎంపీఓ రాజశేఖర్, ఏపీఓలు సుజాత, స్వామిలు, టెక్నికల్ అసిస్టెంట్ నాగరాజు, ఇబ్రహీం, ఉమేరా, ప్రమీలా, ఉపాధి హామీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం అందించాలి



అయిజ : పోషకాహారం లోపంతో చిన్నారులు, గర్భిణులు, మహిళలు అనారోగ్యం బారిన పడుతున్నారని, వారికి పోషకాహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ వెంకటయ్య అన్నారు. సోమవారం ఐకేపీ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటయ్య, డీపీఎం రూతమ్మ, ఏపీఎం అన్నపూర్ణ, ఎంపీఓ మహేష్ గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహార లోపం వలన కలిగే పరిణామాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, మహిళలకు పోషకాహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని, పారిశుద్ధ్య పనులు చేపట్టి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీలుగా గుర్తించొద్దంటూ వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గద్వాల : జిల్లాలో కొందరు బీసీ వర్గానికి చెందిన కుర్వ కులస్తులు మాదాసి కురువ, మాదారి కురువలమని తమను ఎస్సీ కులస్తులుగా గుర్తించాలని ప్రభుత్వం చేపడుతున్న కులగణన సర్వేలో తప్పుడు సమాచారం ఇస్తున్నారని ఆల్‌ఇండియా యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాచర్ల ప్రకాష్ అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ బీఎం సంతోష్‌ను కలిసి వారిని ఎస్సీలుగా గుర్తించకుండా రద్దు చేయాలని వినతిపతరం అందజేశారు. 2017లో అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సమగ్ర విచారణ జరిపి మాదాసి కురువ, మాదారి కురువలు లేరని ధ్రువీకరిస్తూ ప్రభుత్వానికి నివేదిక అందజేసినట్లు తెలిపారు. నిజమైన ఎస్సీ వర్గాలకు అన్యాయం జరిగే జీవో 19ని తక్షణమే రద్దు చేయాలని వినతిలో డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రవిచందర్, నాగరాజు, మార్కెండేయ, బాబు, విజయ్, లాజర్, సురేష్, బీసన్న తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ధరూరు: మండల కేంద్రానికి చెందిన చాకలి బుచ్చన్న సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బండ్ల లక్ష్మీదేవి దంపతులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. భౌతికదేహనికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ పేదల నడ్డి విరుస్తుంది



రాజోళిలో నిరసన చేస్తున్న సీపీఎం నాయకులు



గట్టులో నిరసన చేపట్టిన సీపీఎం నాయకులు

రాజోళి : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బడ్జెట్ పేద ప్రజల నడ్డి విరుస్తుందని సీపీఎం నాయకులు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. పేదలకు న్యాయం చేసే బడ్జెట్‌ను బీజేపీ ప్రభుత్వం ఎప్పుడూ ప్రవేశపెట్టలేదని, కార్పొరేటర్లకు రెడ్ కార్పెట్ పరిచే విధంగా బడ్జెట్ ఉందన్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. కార్యక్రమంలో విజయ్ కుమార్, దస్తగిరి, గోపాల్ రెడ్డి తదిదరులు పాల్గొన్నారు.

పేదల వ్యతిరేక బడ్జెట్..

గట్టు : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ పేదల వ్యతిరేక బడ్జెట్ అని సీపీఎం పార్టీ నాయకులు ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో సీపీఎం నాయకులు కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జిల్లా నాయకుడు వీవీ నర్సింహ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ పేద, మధ్య తరగతుల ప్రజలకు వ్యతిరేకంగా, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉందని ఆరోపించారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచుకునే విధంగా ఉందన్నారు. పేదల దగ్గర అధికంగా వసూలు చేసిన జీఎస్టీ బిల్లులు దోచి కార్పొరేట్ శక్తులకు అప్ప చెప్తున్నారని విమర్శించారు. ఉపాధి హామీ పథకానికి అధికంగా నిధులను కేటాయించలేదన్నారు. అసంఘటిత కార్మికులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. బడ్జెట్‌ను సవరించి, పేదలకు ఉపయోగకరంగా ఉండే విధంగా సవరణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా నాయకురాలు నర్మద, మండల కార్యదర్శి తిమ్మప్ప, కేవీపీఎస్ రాష్ట్ర నాయకులు గట్టు మారెన్న, జిల్లా కార్యదర్శి కర్రెప్ప, హామాలి సంఘం నాయకులు స్వామి, చంద్రు, బలరాముడు, వెంకటేష, లక్ష్మన్నర, భీముడు, శాంతప్ప, బుడ్డన్న, తిప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

గద్వాలటౌన్ : కేంద్ర బడ్జెట్ సామాన్య, మధ్య తరగతి ప్రజలకు వ్యతిరేకంగా.. సంపన్న వర్గాలు, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి ధ్వజమెత్తారు. కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ సోమవారం స్థానిక పాత బస్టాండ్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలకు తాయిలాలు ప్రకటించారని మండిపడ్డారు. బీజేపీ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు, 8 మంది ఎంపీలున్నా రాష్ట్రానికి నిధులు రాబట్టలేకపోయారని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వీవీ నర్సింహ, ఉప్పేర్ నర్సింహా, బాలకృష్ణ, ఆంజనేయులు, తిరుపతన్న, రామకృష్ణ, వీరేష్, రామంజనేయులు, విష్ణు, భాస్కర్ పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణపై అవగాహన



మాట్లాడుతున్న వైద్యాధికారి రాధిక

ఇటిక్యాల : మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంపై మండల వైద్యాధికారి డాక్టర్ రాధిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లకు ఈనెల 10న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం గురించి వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఉమ్మడి మండల పరిధిలోని 1-19 సంవత్సరాలు గల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను ఇవ్వాలన్నారు. నులి పురుగులు ఉన్న పిల్లలు తరచుగా కడుపునొప్పి అని చెప్పడం, ఆకలి మందగించడం, చదువుపై శ్రద్ధ తగ్గడం, రక్తహీనత, బరువు తగ్గడం, ఎదుగుదల లేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. అలాంటి లక్షణాలు గల చిన్నారులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శేఖర్, వెంకటేశ్వర్లు, వెంకటేష, రమేష్, హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాస్, ప్రభాకర్, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కళా ప్రదర్శన విజయవంతం చేద్దాం



ధరూర్‌లో పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎర్రవల్లి: ఈనెల 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న లక్ష డప్పులు.. వేల గొంతులు కళా మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పోగుల రాజేష్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో మహాప్రదర్శన వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలన్నారు. నియోజకవర్గంలోని 58 ఎస్సీ ఉప కులాల మాదిగలంతా ఇట్టి కార్యక్రమానికి భారీ సంఖ్యలో తరలివచ్చి హైదరాబాద్ నడిబొడ్డున డప్పుల మోత మోగించి మాదిగల ఐక్యత చాటాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు రాములు, ప్రభుదాస్, యోహాను, రాముడు, నాగరాజు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ పోస్టర్ విడుదల..

ధరూరు: లక్ష డప్పులు.. వేల గొంతులు నినాదంతో ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో నిర్వహించే చలో హైదరాబాద్ పోస్టర్ విడుదల కార్యక్రమం మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మాదిగ కళామండలి గౌరవ అధ్యక్షుడు డ్యాం వెంకటన్న మాదిగ మాట్లాడుతూ.. ఈనెల 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న కళా ప్రదర్శనను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చిన్నపాడు ఆంజనేయులు, అబ్రహం, రాములు పాల్గొన్నారు.

అయిజ : లక్ష డప్పులు.. వేల గొంతులు కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో మండలంలోని ఉప్పల గ్రామంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో మధుగౌడ్, జయన్న, ఆంజనేయులు, హనుమంతు, దేవన్న, దానయ్య, గోపాల్ పాల్గొన్నారు.

శాంతినగర్ : హైదరాబాద్‌లో నిర్వహించనున్న లక్ష డప్పులు.. వేల గొంతులు మహాసభ పోస్టర్‌ను శాంతినగర్‌లో అలంపూర్ వ్యవసాయ శాఖ మార్కెట్ యార్డు డైరెక్టర్ పైపాడు మహేష్, వడ్డేపల్లి జలంధర్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన ఎస్సీ వర్గీకరణ సాధన సమితి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న మెప్మా సిబ్బంది, ఆర్పీలు

గద్వాల న్యూటౌన్ : ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని మెప్మా ఏడీఎంసీ వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక జములమ్మ ఆలయ పరిసర ప్రాంతాల్లో సోమవారం గద్వాల మున్సిపాలిటీ- మెప్మా ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మెప్మా సిబ్బంది, రీసోర్స్ పర్సన్‌లు ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను తెలియజేశారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధిస్తూ రూపొందించిన స్టిక్కర్లను దుకాణాలు, హోటళ్ల వద్ద అతికించారు. ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు వినియోగిస్తే జరిమానా విధిస్తామన్నారు. కార్యక్రమాల్లో సీఓ నిజాముద్దీన్, రీసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న సీడీపీఓ హేమలత

మల్దకల్ : ఎత్తు, బరువు తక్కువగా ఉన్న చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సీడీపీఓ హేమలత అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. సోమవారం మండలంలోని దాసరపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. డేటాను ఎప్పటికప్పుడు ఎంట్రీ చేయాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణి, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవాలు చేయించుకునే విధంగా సూచించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు అంగన్‌వాడీ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వసంత పంచమిని పురస్కరించుకుని చిన్నారులచే సామూహిక అక్షరభ్యాస కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐగా బాధ్యతల స్వీకరణ

అయిజ: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇన్‌చార్జి ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు సోమవారం పూర్తి బాధ్యతలు తీసుకున్నారు. ఇంతకాలం అయిజ పోలీస్ స్టేషన్‌లో పనిచేసిన విజయ భాస్కర్ వనపర్తి వీఆర్‌కి వెళ్లారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతలకు ప్రజలు సహకరించాలని కోరారు.